క్లుప్తంగా

కపిలేశ్వరపురంలో వైద్య పరీక్షలు



రామకృష్ణ నగర్‌లో సేవలందిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

కపిలేశ్వరపురం: గ్రామ శివారు రామకృష్ణ నగర్‌లో గురువారం అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రత్నకుమారి పర్యవేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు. 50 మందికి బీపీ, షుగరు తదితర సాధారణ వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. శిబిరంలో ఆరోగ్య కార్యకర్త తోటకూర రామకృష్ణ, పి.ఝాన్సీరాణి తదితర సిబ్బంది వైద్య సేవలనందించారు.

దాసరికి ఘన నివాళి



దాసరికి పుష్పాంజలి ఘటిస్తున్న ట్రస్టు సభ్యులు

మండపేట: చలనచిత్ర పరిశ్రమకు దాసరి నారాయణరావు మేలు పర్వతం వంటి వారని డీఎన్ఆర్ భవన్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ కామన ప్రభాకరరావు అన్నారు. మండలంలోని ఏడిదలో ఉన్న డీఎన్ఆర్ ట్రస్టు భవన్‌లో గురువారం స్వర్గీయ దాసరి నారాయణరావు 7వ వర్ధంతిని నిర్వహించారు. కామన ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు దాసరి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కామన మాట్లాడుతూ డాక్టర్ దాసరి సుమారు 160 చలన చిత్రాలుకు దర్శకత్వం వహించిన గొప్ప దర్శకుడని అన్నారు. చిత్ర పరిశ్రమలోనే కాకుండా, పత్రికా రంగంలో సరికొత్త ఒరవడిని తీసుకొచ్చిన గొప్ప సంపాదకునిగా పేరు పొందారని కొనియాడారు. ప్రపంచ రికార్డులలో దర్శకునిగా గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించిన మొట్టమొదటి వ్యక్తిగా దాసరి కీర్తిని ఆర్జించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాడిశెట్టి సత్యనారాయణ, గండ్రోతుల రామచంద్రరావు, పర్వతిన వీరవెంకట సత్యనారాయణ, వాసిరెడ్డి బాబూరావు, కొడవళ్ల వెంకట సుబ్బారావు, ముగ్గళ్ల శ్రీను, కుచ్చు బాబి, వల్లభదాసు చిన్న, ఒ.చిన్న తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు దాతల విరాళం



దాత కుటుంబానికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం పలువురు విరాళాలు సమర్పించారు. రామచంద్రపురానికి చెందిన గౌతు లక్ష్మీ మంగతాయారు స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు గౌతు వెంకటేశ్వరరావు రూ.10,117, విజయవాడ గంపలగూడేనికి చెందిన కుప్పాల శ్రీకాంత్, రాజేశ్వరి దంపతుల పెళ్లి రోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు బొమ్మకాని కోటేశ్వరరావు, అరుణకుమారి దంపతులు రూ.10 వేలు అందించారు. ఈ విరాళాలను ఆలయ ఉద్యోగులకు అందజేశారని ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ ఉద్యోగులు, అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఇచ్చారు.

ఏపీఈసెట్‌లో 92.82 శాతం ఉత్తీర్ణత

రాయవరం: ఏపీఈసెట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా విద్యార్థులు 92.82 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ నెల 8వ తేదీన ఏపీఈసెట్ పరీక్షలను నిర్వహించారు. రెండు సెషన్స్‌లో ఈ పరీక్షను నిర్వహించగా, జిల్లా నుంచి 360 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా, 348 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 323 మంది విద్యార్థులు(92.82శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఏపీఈసెట్‌లో ఉత్తీర్ణులై అర్హత పొందడం ద్వారా లేటరాట్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరం ఇంజినీరింగ్ డిగ్రీ కోర్సు లేదా రెండో సంవత్సరం ఫార్మసీ కోర్సులో ప్రవేశించడానికి వీలవుతుంది.

ఏపీ ఐసెట్‌లో 98.53 శాతం

ఐసెట్–2024లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 98.53 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అమలాపురం కేంద్రంగా నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 360 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, 342 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 337 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షలో అర్హత సాధించారు. ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో 14,171 మంది బాలురు, 16,293 మంది బాలికలు దరఖాస్తు చేసుకోగా, 12,810 మంది బాలురు, 14942 మంది బాలికలు ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 12,422 మంది బాలురు, 14,597 మంది బాలికలు అర్హత సాధించారు.

పరకే బంగారమాయె..



అంగరలో వరిని మాసూలు చేస్తున్న యంత్రం

- యంత్ర వినియోగంతో గడ్డి ఛిద్రం
- 120 గ్రామాల్లో 99,583 ఎకరాల్లో వరి సాగు
- ఏర్పడిన వరిగడ్డి కొరత
- కలవరపెడుతున్న పశుగ్రాస సమస్య

కపిలేశ్వరపురం: రబీసాగు ఆశాజనకంగా ఉంది. వరి మాసూలు పనులు సజావుగా పూర్తయ్యాయి. రైతు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నాడు. ఇదిలా ఉండగా రబీ సాగు ప్రక్రియలో అవలంబించిన పద్ధతులు వల్ల మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో గడ్డి కొరత తలెత్తింది. యంత్రాలను ఆశ్రయించి కోతలు చేపట్టడంతో వరిగడ్డి చిన్నచిన్న ముక్కలుగా తయారవడంతో అది పశువులకు వినియోగించలేదని పరిస్థితి నెలకొంది.

పెట్టుబడి, సమయం ఆదా

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని రైతులు యంత్రాల సాయంతో కోతలు చేపట్టారు. ఎకరా కోతకు కూలీలకు రూ.3 వేలు, నూర్పులకు రూ.3వేలు, ట్రాక్టరు అద్దె రూ.2 వేలు, బరకాల అద్దె రూ.200, ఇతర ఖర్చులు రూ.1500, మొత్తం 9,700 ఖర్చవుతుంది. అయితే రూ.5 నుంచి రూ.6 వేలకు యంత్రంతో మాసూలు ప్రక్రియను పూర్తి చేసుకుంటున్నారు. సమయమూ ఆదా అవుతుంది. దీనికితోడు తరచూ వాతావరణ మార్పులు ఆందోళనకు గురి చేస్తుండడంతో త్వరితగతిన వరి మాసూళ్లు చేసుకునేందుకు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.

ధర పెరిగి..

యంత్రం కోత వల్ల గడ్డి ఛిద్రమైపోతుంది. గడ్డికి ఆయిల్ మరకలు కారణంగా పశువులు ముట్టవు.

రెండు నియోజకవర్గాల్లో రబీ వరిసాగు ఇలా..

మండలం	గ్రామాలు	వరిసాగు (ఎకరాల్లో)
మండపేట	12	16,296
రాయవరం	12	14,509
కపిలేశ్వరపురం	19	15,758
రామచంద్రపురం	25	18,120
కె.గంగవరం	26	15,444
కాజులూరు	26	19,456
మొత్తం	120	99,583

చేసేది లేక గడ్డిని రైతు పొలంలోనే తగలబెడుతుంటారు. కూలీలచే కోయించిన గడ్డికి డిమాండ్ ఉంది. ట్రాక్టరు గడ్డి రూ.7వేలు నుంచి రూ.8 వేలు పలుకుతోంది.

యంత్రాల వినియోగంతో..



ఏటా రబీ గడ్డి పశువులకు పనికిరాకుండా పోతుంది. దీంతో పశువులు అల్లాడుతున్నాయి. వ్యవసాయ క్షేత్రాల్లో గట్లు సన్నగిల్లడంతో పచ్చగడ్డి కొరత ఉంది. పోనీ ఎండుగడ్డినైనా వేద్దామనుకుంటే యంత్రాల వినియోగంతో అది కూడా పనికిరాకుండా పోతోంది. దీంతో పశువులకు గడ్డి కొరత ఏర్పడుతోంది..

– యానాల సీతారామయ్య, పాడి రైతు, అంగర



అధిక ఉష్ణోగ్రతలకు నెత్తిన చెంగు కప్పకుని వెళ్తున్న మహిళ

భానుడి భగభగలు

అధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్న ప్రజలు



నెత్తిన టోపీ, ముఖానికి వస్త్రం కట్టుకుని వెళ్తున్న మోటార్‌సైక్లిస్ట్

రాయవరం: రోహిణీ కార్తెలో రోళ్లు పగులుతాయన్నది సామెత. రోహిణీ కార్తె ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజలు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరవుతున్నారు. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు తిరిగి పెరిగిపోయాయి. సూరీడు తన ప్రభావాన్ని చూపించాడు. నైరుతి రుతుపవనాల ఆగమనం వరకు వాతావరణం ఇలాగే ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు తెలపడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గురువారరం 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం అల్లాడిపోతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు రహదారులు ఖర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఎండవేడికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా చిన్నారులు, వృద్ధుల పడుతున్న బాధలు వర్ణనాతీతం. వేడి గాలులతో జనం ఇబ్బంది పడుతున్నారు.

ఆలయ భూముల కౌలు వేలం ఖరారు



ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు

రాయవరం: సోమేశ్వరంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ భూములకు గురువారం కౌలు వేలం ఖరారు చేశారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఈవో బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కౌలు వేలం నిర్వహించారు. సోమేశ్వరస్వామి ఆలయానికి చెందిన 4.37 ఎకరాల భూమిని కాళ్ల మణిప్రసాద్ ఏడాదికి రూ.2.20 లక్షల హెచ్చు కౌలుకు పాడుకోగా, 2.25ఎకరాల భూమిని రూ.1.05 లక్షలకు గరగ వెంకటేశ్వరరావు, 2.48 ఎకరాల భూమిని గాలి సాంబయ్య రూ.60వేలు, 1.70 ఎకరాల భూమిని బుద్దాల వెంకన్న రూ.95 వేలు, 1.50ఎకరాల భూమిని గరగ సూరిబాబు రూ.43వేల హెచ్చు కౌలుకు వేలం పాట పాడుకున్నారు. మూడు సంవత్సరాల కాల పరిమితికి వేలం పాటలు నిర్వహించారు. అలాగే వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన 3.17 ఎకరాల భూమిని గంగిశెట్టి సూరిబాబు రూ.1.34 లక్షలు, 2.50 ఎకరాల భూమిని అబ్బిరెడ్డి సత్యనారాయణ రూ.1,25,500, 2.30ఎకరాల భూమిని పసుపులేటి సూరిబాబు రూ.1.21లక్షలు హెచ్చు కౌలుకు ఏడాది కాలపరిమితికి చెల్లించేలా పాడుకున్నారు. మూడు సంవత్సరాల కాలపరిమితికి వేలం పాటలు నిర్వహించారు. వేలం పాటల్లో సర్పంచ్ ఆరిఫ్, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, సోమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ, పెద్దింటి శేషాచార్యులు, పసలపూడి ఆలయ ఈవో ఎస్.అయ్యపరాజు, దేవస్థానం సిబ్బంది పెమ్మాడి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

రాబోయేది వైఎస్సార్ సీపీ స్వర్ణయుగమే

- ప్రతిపక్షాలు అవాకులు చవాకులు మానాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు



పాపారాయుడు

మండపేట: వచ్చే నెల నాలుగో తేదీన వచ్చే ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని తెలుసుకున్న విపక్షాలు, ఎన్డీఏ కూటమి అవాకులు చవాకులు పేలుతోందని, వాటిని విరమించుకుంటే బాగుంటుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ నాయకుడు ముందే చెప్పినట్టుగా 151 అసెంబ్లీ, 22 పైగా ఎంపీ స్థానాలతో ఘన విజయం సాధించడం తథ్యమని ఆయన మరోసారి అన్నారు. జూన్ 4 వరకూ ఓపిక పట్టాల్సిన ప్రతిపక్షాలు ఓటమి భయంతో ఎవరికి ఇష్టమొచ్చినట్టు వారు వ్యాఖ్యానాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చెప్పిందే చేస్తాడని చేసిందే చెబుతాడని స్పష్టం చేశారు. గత 2019లోనూ ఎన్నికలు పూర్తయిన తర్వాత విదేశాలకు వెళ్లారని ఇదేమి కొత్త కాదన్నారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా ఆయన చెప్పినట్టుగా ఎన్నికలను దిగ్విజయంగా పూర్తి చేసుకున్న ఆయన అలసి విదేశాలకు వెళ్లారన్నారు. నాలుగో తేదీ నుంచి రాష్ట్రంలో మరో స్వర్ణయుగం ఏర్పడబోతోందని ఆయన జోస్యం చెప్పారు. ఇప్పటికే రూ. 2.70 లక్షల కోట్లను పేద మధ్యతరగతి వర్గాలకు సంక్షేమ పథకాల రూపంలో చేరవేసిన ఘనత దేశంలో ఆయనకే దక్కిందన్నారు. వైఎస్ జగన్ రెండోసారి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మరింత సమరోత్సాహంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథం వైపు నడిపించడంతో పాటు సంక్షేమ ఫలాలను పేద ప్రజలందరికీ ముందుకు తీసుకువెళ్తారని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చేంత వరకూ అనవసరంగా మాట్లాడడం మంచిది కాదని పాపారాయుడు మరోసారి హితవు పలికారు.

నేడు మండల సమావేశం

రాయవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో కె.వెంకటలక్ష్మి గురువారం విలేకరులకు తెలిపారు. ఎంపీపీ నౌడు వెంకటరమణ నోట్ ఉత్తర్వులను అనుసరించి, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రజా ప్రతినిధులు, డివిజనల్, మండల స్థాయి అధికారులు వారి శాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె సూచించారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాయవరం: పసలపూడి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీపీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు. సోమేశ్వరం–పసలపూడి మధ్య వెళ్లే 33 కేవీఏ విద్యుత్ లైన్లలో మధ్యలో పోల్స్ వేస్తున్నందున పసలపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని యర్రమట్టిపురం, పసలపూడి, నరాలవారిపాలెం, సర్వారాయతోట, కృష్ణమ్మచెరువు, చెల్లూరులోని సగభాగం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

శుభ్రతపై అవగాహన

ఆత్రేయపురం: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో దుకాణదారులకు ఆహార ఉత్పత్తి, శుభ్రతపై జిల్లా ఎఫ్ఎస్ఓ ప్రసాద్ అవగాహన కల్పించారు. వ్యాపారులు పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార నాణ్యతా ప్రమాణాలు ఎలా పెంచాలనే విషయమై శిక్షణ ఇచ్చారు. టీటీటీ ఇండియన్ ఫుడ్ సొల్యూషన్స్ డైరెక్టర్ బ్రిజేష్ పటేల్, మేకా సూర్యనారాయణ, గద్దె గోపాలకృష్ణ, శ్యామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్ నిర్మించాలి

కాజులూరు: కాకినాడ– కోటిపల్లి రహదారిలో గొల్లపాలెంలోని కాజులూరు జంక్షన్ వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కరప, కాజులూరు మండలాల్లో 20 గ్రామాలకు కూడలి ఇది కూడలి. ఈ సెంటర్‌లో నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సులు ఎక్కుతుంటారు. ఇక్కడ ప్రజలకు సరైన షెల్టర్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. షాపుల అరుగులపై, దుకాణాల ఎదుట నిలిచి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నిరీక్షించాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ఇక్కడ బస్ షెల్టర్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కౌంటింగ్ రోజున వివాదాలకు దిగితే చర్యలు



నల్లూరు గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై పరదేశి

కపిలేశ్వరపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున వివాదాలకు దిగితే చట్ట పరిధిలో చర్యలు తప్పవని అంగర ఎస్సై అందే పరదేశి హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో కౌంటింగ్ రోజు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో భాగంగా గురువారం నల్లూరులో గ్రామస్తులతో సమావేశమయ్యారు.

అట్టహాసంగా అమ్మవార్ల తీర్థం



పాశర్లపూడిలో దేవతలు నూకాలమ్మ, మహాలక్ష్మమ్మ



జి.అగ్రహారంలో షిరిడీ సాయిబాబు

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామ దేవతలు నూకాలమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల తీర్థ మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. సోమవారం నుంచి గురువారం వరకూ జాతరను ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాల అలంకరణలు, పూలతో అమ్మవార్ల ఆలయాలను దేదీప్యమానంగా తీర్చిదిద్దారు. తీర్థం సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

బాబా మందిర వార్షికోత్సవం

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారంలో సాయిబాబు మందిర వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు సుదర్శనం కేశవచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

హనుమజ్జయంతికి ఏర్పాట్లు

సఖినేటిపల్లి: వచ్చే నెల 1న హనుమజ్జయంతిని పురస్కరించుకుని మండలంలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ఆయా కమిటీలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాయి. ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. మోరి, అంతర్వేదికర, టేకిశెట్టిపాలెం ఏటిగట్టు, అంతర్వేది రోడ్డు సెంటర్, కేశవదాసుపాలెంలలో ఆలయాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మోరి శ్రీరామభక్తాంజనేయ స్వామివారి ఆలయం వద్ద అర్చకుడు సుదర్శనం రంగాచార్యులు ఆధ్వర్యంలో, మోరి శేషన్న రాయుడు కాల్వగట్టు ప్రసన్నాంజనేయ స్వామివారి ఆలయం వద్ద అర్చకుడు ఎస్‌బీవీఎస్ సాయి దుర్గానగేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, నిత్య సింధూర పూజలు నిర్వహించనున్నారు. స్వామివారి భక్త బృందం సభ్యులచే ఏకాహం ఆలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నారు.

చెలరేగిన మట్టి మాఫియా



ఆర్యావటం రెవెన్యూ పరిధి పొలంలో మట్టిని తవ్వి ట్రాక్టర్‌పై తరలిస్తూ..



గొల్లపాలెం నుంచి బట్టీలకు అనధికారికంగా మట్టి తరలింపు

- బట్టీలు, లేఅవుట్‌లకు తరలింపు
- ప్రభుత్వ ఖజానాకు గండి

కాజులూరు: గోదావరి నదీ తీరానికి ఆనుకుని ఉన్న కాజులూరు మండల గ్రామాలు ఒకప్పుడు పంట పొలాలు, మధ్యలో ఇసుక దిమ్మెలతో కళకళలాడుతుండేవి. కోనసీమకు సరిహద్దులోని ఈ మండలంలో కొబ్బరి, మామిడి తోటలు ఉండేవి. ఇటీవల మట్టి మాఫియా కళ్లు ఈ ప్రాంతాలపై పడింది. గ్రామాల్లోని ఇసుక, మట్టి దిమ్మెలను క్రమేపీ కరిగించేస్తున్నారు. పుదుచ్చేరి ప్రాంతమైన యానాంతో పాటు సమీపాన ఉన్న రామచంద్రపురం, కాకినాడ తదితర ప్రాంతాల్లో లే అవుట్‌లు, ఇటుక బట్టీలకు ఇక్కడ ఇసుక, మట్టి తరలిస్తున్నారు. పొలాల్లో మెరక పల్లాలను చదును చేసుకునేందుకు కొందరు రైతులు మట్టిని తవ్వి మరోచోటుకు తరలిస్తుంటారు. వాస్తవానికి పొలాల్లో ట్రక్కు మట్టి తీయాలన్నా రెవెన్యూ, గనుల శాఖల అధికారుల అనుమతులు ఉండాలి. ప్రతి ట్రక్కుకు వేబిల్లు ఉండాలి. దీనినే కొందరు అదునుగా చేసుకుని మెరక పల్లాల వంకతో వ్యాపారులు పొలంలో మట్టి, దిమ్మెలను తవ్వి లేఅవుట్‌లు, ఇటుకల బట్టీలకు తరలిస్తుండడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. కాసులకు కక్కుర్తిపడి పలువురు సిబ్బంది ఈ మట్టి అక్రమ తవ్వకాలను ప్రోత్సహిస్తుండటంతో వ్యాపారం జోరుగా సాగుతుంది. గతంలో ట్రాక్టర్లతో సాగే వ్యాపారం లారీల స్థాయికి చేరుకున్నప్పటికీ మైనింగ్ బిల్లులు చెల్లించిన దాఖలాలు ఉండడం లేదు. పొలాల నుంచి ట్రాక్టర్, లారీలతో మట్టి రవాణా జోరుగా సాగుతుండటంతో విలువైన రహదారులు ధ్వంసమవుతున్నాయి. ఇవి వేగంగా వెళ్తుండడంతో రోడ్డు ప్రమాదాలూ జరుగుతున్నాయని స్థానికులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్యావటంలో ఒక రైతు గృహ నిర్మాణంలో భాగంగా తన పొలంలో మెరక తీసి ఆ మట్టిని తన ఇంటి పునాదుల్లోకి తీసుకువెళ్తుండగా అడ్డుకున్న రెవెన్యూ అధికారులు.. లేఅవుట్‌లు, ఇటుక బట్టీలకు వందలకొలది లారీలతో మట్టిని తరలిస్తున్నా పట్టించుకోకపోవటంపై విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో కొందరు దళారుల అవతారమెత్తి మట్టి వ్యాపారుల నుంచి సొమ్ము వసూళ్లు చేసి అధికారులకు ముడుపులు ఇస్తున్నారని సమాచారం. గొల్లపాలెం మెయిన్‌రోడ్‌లో విచ్చలవిడిగా తిరుగుతున్న మట్టి ట్రాక్టర్లను రెండు రోజుల కిందట కొందరు యువకులు అడ్డుకున్నారు. సంబంధిత అన్ని శాఖల అధికారులకు ముడుపులు చెల్లించే తాము మట్టి తోలుతున్నామని, తమను ఎవరూ అడ్డుకోరంటూ మట్టి వ్యాపారులు చెప్పి యువకులపై ఎదురు తిరిగి యథేచ్ఛగా మట్టి రవాణా సాగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

రుచిగా.. శుచిగా మధ్యాహ్న భోజనం



కొత్తపేట సమావేశంలో మాట్లాడుతున్న డీపీడీ సురేష్‌కుమార్

కొత్తపేట: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచిగా.. సుచిగా ఉండాలని మధ్యాహ్న భోజన పథకం జిల్లా అడిషనల్ డైరెక్టర్ డి.సురేష్‌కుమార్ సూచించారు. విద్యాశాఖ ఆదేశాల ప్రకారం మండలంలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు, కుక్ కమ్ హెల్పర్లకు స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఒకరోజు శిక్షణ ఇచ్చారు. ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సురేష్‌కుమార్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యాభివృద్ధి పథకాల్లో మధ్యాహ్న భోజన పథకం అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. దీనిని సక్రమంగా అమలు చేయాలని సూచించారు. మెనూ పక్కాగా అమలు చేయాలన్నారు. ఎంఈఓ హరిప్రసాద్, ఎంఈఓ- 2 లీలావతి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి తినేలా వంటలు వండాలని అన్నారు. వంటల పోటీలు నిర్వహించారు.

సమర్థవంతంగా మెనూ

సఖినేటిపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం మెనూను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా సమగ్ర శిక్షా సీఎంఓ బి.సుబ్రహ్మణ్యం సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ–1 డి.కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో మండలంలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. అలాగే నిర్వాహకులకు వంటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం కుక్ కమ్ హెల్పర్ ఎ.గంగప్రసాద్ ఆహార పదార్థాల తయారీ వీడియోలను చూపించారు. ముఖ్య అతిథి సీఎంఓ మాట్లాడుతూ ఈ శిక్షణ భోజన మెనూను సమర్థవంతంగా అందించడానికి దోహదపడుతుందన్నారు. సఖినేటిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి గాయత్రి మాట్లాడుతూ పిల్లలకు ఆహార పదార్థాల తయారీలో తగిన శుభ్రత పాటించాలన్నారు. భోజనం తయారీలో గ్యాస్ పొయ్యి వాడకంలో ఏమైనా ప్రమాదం సంభవించినపుడు, వాటి నివారణ చర్యలను రాజోలు ఫైర్ స్టేషన్ ఆఫీసర్ బి.బాలకృష్ణ ఆధ్వర్యంలో మరో అధికారి బి.ఉమా మహేశ్వరరావు, సిబ్బంది వివరించారు. అనంతరం వంటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి

సఖినేటిపల్లి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని, ఇది కొద్ది రోజుల్లోనే ఎన్నికల కౌంటింగ్ రోజున తేలనుందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు తాడి సహదేవ్ అన్నారు. గురువారం వీవీ మెరకలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ రోజున భారీ క్యూలో ప్రత్యేకించి మహిళలు నిలబడి ఫ్యాన్ గుర్తుకే ఓటేశారన్నారు. విశాఖపట్నం వేదికగా సీఎంగా జగనన్న చేయబోయే ప్రమాణ స్వీకారం కోసం ప్రజలు ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నారన్నారు.